ఓం నమోభగవతే శ్రీరమణాయ శ్రీభారతీదేవ్యైనమః

# ఉమాసహస్రము

## (పదియవ శతకమున - ద్వితీయ స్తబకము)

### అష్టత్రింశ స్తబకము

**అవ:**- ఇంతకు ముందు దశమహావిద్య ఉల్లేఖింపఁబడినవి. ముప్పది యెనిమిదవదగు నీ స్తబకమున - ఆ విద్యలస్వరూపమును నిరూపించి, తదుపాస్తి ఫలములను దెలుపుచున్నాఁడు.

మూ॥ దూరీకురుతాద్దుః ఖం నిఖిలం
దుర్గాయాస్తద్దరహసితం నః।
రచితాస్యామ్బోమృద్భ్యాం యదభూ
ల్లేపన మమలం బ్రహ్మాణ్డస్య॥ 1

నీటి చేతను, మట్టిచేతను, నిర్మింపబడిన బ్రహ్మాండమునకు - స్వచ్ఛమగు వర్ణ విలేపన (తేజ) మగు దుర్గాదరహసితము - మా దుఃఖమునంతను తొలఁగించుఁగాత!

**ప్రభ:**- 'నీటి చేతను మట్టిచేతను' అని చెప్పఁబడుట వలన, బ్రహ్మాండమునకు, భాండత్వము - (పెద్దదగు కుండగానునికి) ఆక్షేపింపఁబడుచున్నది. (బ్రహ్మాండమనునది. భాండమని, చెప్పినట్లగుచున్నది.) ''తేజోజలాన్నములను త్రిధాతువుల చేత నీ బ్రహ్మాండము సృజింపఁబడినది.'' అని (ఛాందోగ్య) ఛందోగుల శృతి వలనఁ దెలియుచున్నది. జలము చేతను, మట్టియేయగు నన్నముచేతను, సృజింపఁబడిన బ్రహ్మాండమునకు, అణిష్ఠమగు తేజోధాతువే - సృష్టిపూరకమును, వ్యాపకమును, అగు మూలమగుచున్నది. ఆ తేజస్సే - దరహసితముగాఁ జెప్పఁబడినది. తేజస్సు లేని యెడల - జలాన్నమయమగు బ్రహ్మాండమునకు శోభయే కలుగనేరదు. శోభా విశేషరహితమగు బ్రహ్మాండము - నిస్తేజమేయగును. కావున, దృశ్యమే కాకపోవలసి వచ్చును. కావున, బ్రహ్మాండమునకు - దృశ్యత్వము సిద్ధింపఁజేయుటకు, వ్యాపకమగును ''మాదరహాసితము- శోభా వహమగుచుండును. ''మట్టిచేతను, నీటి చేతను, నిర్మింపబడిన కుండకు - వర్ణలేపము (రంగుపూత) శోభావహమగునట్లు, అబన్నసృష్టమగు బ్రహ్మాండమునకు, ఉమాదరహసితము - వ్యాపకమగు తేజమగుచుండును'' అనునుపమ - ఇందు ధ్వనించుచున్నదని తెలియునది.



మూ॥ జన్తౌ జన్తౌ భువిఖేలన్తీ
భూతే భూతే నభసి లసన్తీ
దేవే దేవే దివి దీప్యన్తీ
పృథగివ పూర్ణాసంవిజ్జయతి॥ 2

భూలోకమునందు - జంతు జంతువునందును - (ప్రతి జంతువు నందును - ప్రత్యేకముగా) క్రీడించుచు, అంతరిక్షమున (భువర్లోకమున) భూత భూతమునందును (ప్రతి దేవయోని విశేషమునందును) విలసిల్లుచు, ద్యులోకమున (స్వర్లోకమున) ప్రతి దేవతయందును, దీపించుచు, పూర్ణయగు సంవిత్తు - (చితి) ఒక్కటియేయైనను, భిన్నమైనది వలె, నొప్పుచున్నది.

మూ॥ దహరసరోజాద్ ద్విదలసరోజం
ద్విదలసరోజాద్ దశశతపత్రమ్।
దశశతపత్రాద్ దేహం దేహాత్
సకలం విషయం సంవిద్ వ్రజతి॥ 3

సంవిద్రూపమగు చితి – దహరసరోజమగు హృదయ కమలము నుండి! భ్రూమధ్యస్థితమును, ద్విదలమును, అగు ఆజ్ఞాకమలమునకును, ఆద్విదళకమలము నుండి – ( ఆజ్ఞా చక్రమునుండి) (సహస్రదళములు గల) సహస్రార కమలమునకును, ఆ సహస్రార చక్రము నుండి శరీరమునకును, ఆ శరీరము నుండి – వెలుపల నున్న సకల విషయములకును. ప్రసరించుచుండును.

**ప్రభ:-** ఆజ్ఞా కమలము– 'రెండు దళములు' గలదనియు, సహస్రారము– 'వేయి రేకులు' గలదనియు, తంత్రశాస్త్రమునఁ బ్రసిద్ధమగుచున్నది. దహరము నుండి ప్రారంభించుట వలన, చితికి మూలమగు స్థానము – హృదయమని స్పష్టమగుచున్నది. స్వగురువగు మహర్షిచేత నుపదేశింపఁబడిన యీ యంశము నీయాచార్యుఁడు స్వవిరచితమగు ' శ్రీ రమణగీతయందు' సవిస్తరముగా నిట్లు, నిబంధించియున్నాఁడు.

''తస్మాత్ ప్రవహతిజ్యోతిః సహస్రారం సుషుమ్నయా
సర్వం దేహం సహస్రారాత్, తదాలోకానుభూతయః' అని,

''హృదయము నుండి – సుషుమ్నా మార్గమున, జ్యోతిస్సు – సహస్రారమునకును, సహస్రారమునుండి – సర్వ దేహమునకును, ప్రవహించు చుండును. అప్పుడు లోకానుభవములు కలుగును.'' రమణగీతయందున్న యైదవ యధ్యాయమునందలి, **5, 6, 7** శ్లోకములను పరిశీలించిన విషయము స్పష్టమగును.

మూ॥ వహ్నిజ్వాలా సమిధమివైషా
సకలం దేహం సంవిత్ ప్రాప్తా
పృథగివభూతా వ్యపగతవీర్యా
భవతిసధూమా సంసారాయ॥ **4**



అగ్నిజ్వాల – ఇంధనమునందు వలె, హృదయ నిలయమగు సంవిత్తు – దేహమునందంతటను వ్యాపించి, పరమార్థమున తానఖండయైయున్నను, భిన్నయైనది (వేరయినది వలె) నగుచున్నది. కావుననే, క్షీణబలయై, సధూమయై, (జడసంపర్కము వలన స్వచ్ఛతలేనిదై) సంసార బంధమును గూర్చుచున్నది.

**ప్రభ:-** స్వస్థానమగు హృదయము నుండి – యీ సంవిత్తు దేహమునందు స్థాలిత్యము నొంది, సంసార హేతువగు చుండునని భావము. (హృదయము నుండి– వెలువడకుండిన యెడల, సంసారము కలుగదు.)

**అవ:-** ప్రజ్ఞాస్ఖలనము వలనఁగలిగిన సంసారము యొక్క స్వరూపమును దెలుపుచున్నాఁడు.

మూ॥ అత్రానుభవ స్సుఖదుఃఖానామత్రాహఙ్కృతిరనృతాభవతి।
అత్రైవేదం సకలంభిన్నం ప్రతిభాసేత ప్రజ్ఞాస్ఖలనే. **5**

ప్రజ్ఞా – స్ఖలనము వలన, సుఖ దుఃఖానుభవము కలుగును. ప్రజ్ఞా స్ఖలనము వలన, అనృతమగు నహంకారము కలుగును. అది స్ఖాలిత్యము నొందునప్పుడే – యీ జగత్తంతయు, భేదము గలిగి ప్రతిభాసించును.

**ప్రభ:-** ' ఇది' యది చెప్పఁదగిన, దేహాదికమునందు – 'నే' నను ప్రతీతియే– అనృతమగు నహంకారమని తెలియునది. సత్యమగు అహంకారము మాత్రమే– పూర్ణమగు – అహంభావస్థితియై యున్నది – అదియే – అహమున కాశ్రయమగు స్వరూపస్ఫూర్తి కావున నది – అహంకారమని చెప్పఁదగినది కాదు. స్వస్థానమగు హృదయమునుండి – ప్రజ్ఞదిగజారునపుడీ సంసారము కలుగును – ప్రజ్ఞ – స్ఖలనము నొందని యెడల దుఃఖావృత భేద బహులమగు నీ సంసారము కలుగదని యభిప్రాయము.

అవ:- కావున - ఈ సంసారము నివర్తించుట కుపాయము - 'నిత్య - నిష్ఠయే' యగునని, తత్ ప్రకారమును దెలుపుచున్నాడు.

మూ॥ దశశతపత్రాద్ద్వి దలసరోజం
ద్విదలసరోజాద్ దహరసరోజమ్।
అవతరతీశా యేషామేషా
తేషా మన్తర్నిత్యా నిష్ఠా॥ 6

**ఈశ్వరియగు సంవిత్తు - ఏ యోగుల సహస్రారము నుండి - ఆజ్ఞా చక్రమునకును; ఆయాజ్ఞా చక్రమునుండి - హృదయకమలమునకును దిగుచుండునో, ఆ యోగులకు - నిత్యమగు ( అ చంచలమును, సిద్ధమును అగు) నిష్ఠ కలుగును.**

**ప్రభ:**- మనఃస్థానము - సహస్రారము, తనయుదయస్థానమగు హృదయమును విడిచి, శిరస్సునందున్న వారికి - విక్షేపమును, దాని వలన, సంసారమును, కలుగును. కావున, సహస్రారచక్రము నుండి - యాజ్ఞాచక్రము ద్వారా, తనమూలస్థానమగు హృదయమును బొందుటయే - దానికి ప్రతిక్రియయగును. అచ్చట నగునిష్ఠ నిత్యమని చెప్పఁబడినది. సాధకులకిది - ముఖ్యము.

**అవ:**- మఱికొన్ని '' ఉపాసనా ప్రకారములను'' దెలుపుచున్నాడు.

మూ॥ అథవా దేహాదావృత్తస్స
న్నన్యతమస్యా మాసుస్థల్యామ్
ఆధారస్థే కులకుణ్డే వా
స్థితధీర్నిత్యాం నిష్ఠాం లభతే॥ 7



వేఱొక పక్షమున - శరీరము నుండి మరలి యంతర్ముఖుఁడై, ముందు చెప్పఁబడఁగల యనేకములగు స్థలములలో, నేదోయొక స్థానమునందుఁగాని, మూలాధారమునందున్న కులకుండమునందుఁగాని, ( కుండలినీ శక్తి నివసించు, అగ్ని కుండము నందుఁగాని,) నిలిచిన ప్రజ్ఞగల వాఁడు ( ప్రజ్ఞను నిలిపిన వాడు-) నిత్యమగు నిష్ఠనొందును.

**ప్రభ:**- మందుచెప్పఁబడు స్థలములందైనను, కులకుండమునందైనను, ప్రజ్ఞనునిచిన యోగికిఁకూడ - నిత్యమగు నిష్ఠకలుగునని భావము.

**అవ:**- 'లలితాత్రిపుర సుందరి' మొదలగు మహా విద్యల స్వరూపములను- ఉపాసనలను గూడఁ దెలుపుచున్నాఁడు.

మూ॥ దశశతపత్రే శక్తిర్లలితా
వజ్రవతీ సా ద్విదల సరోజే।
దహరామ్బురుహే భద్రాకాలీ
మూలాధారే భైరవ్యాఖ్యా॥ 8

వేయి రేకులు గల సహస్రారము నందు - లలితా త్రిపుర సుందరి - విలసిల్లుచున్నది. రెండు రేకులు గల యాజ్ఞా చక్రమునందు వజ్రవైరోచనియనియు, ఛిన్నమస్తయనియు, ప్రచండచండియనియు, ఇంద్రియనియు, చెప్పఁబడు, 'వజ్రవతి' - విరాజిల్లుచున్నది. దహరాకాశమను పేరు గల హృదయపద్మమున, 'భద్రకాళి' వెలయుచున్నది. మూలాధారమున (కులకుండమునందు) 'భైరవీశక్తి' (త్రిపుర భైరవి) వెలుఁగుచున్నది.

మూ॥ ఖేలతి లలితా ద్రవతి స్థానే
ఛిన్నగ్రన్థిని రాజత్యైన్ద్రీ।
భద్రకవాటే భద్రాకాలీ
తపసా జ్వలితే భైరవ్యాఖ్యా॥ 9

అమృతమును వర్షించు స్థలమగు సహస్రారమున, త్రిపుర సుందరి విలసిల్లుచుండును. ఛిన్న గ్రంధియగు స్థలమగు, ఆజ్ఞాచక్రమున – ఐంద్రీశక్తియగు వజ్రవిరోచని విరాజిల్లుచుండును. బద్ధవాటమగు హృదయమునందు – భద్రయగు కాళియుండును. తపస్సుచేత జ్వలించుచున్న మూలాగ్ని కుండమున, త్రిపుర భైరవి దీపించుచుండును.

**ప్రభ:-** లలితా త్రిపుర సుందరీ విలాసము వలన, సహస్రారమున సోమరసము స్రవించును. ఆజ్ఞాచక్రాంతరాళమునందున్నదియు, రుద్రగ్రంధి విభేదినియునగుచు, ఫాలమునందలి రుద్ర గ్రంధి భేదింపఁబడునపుడు, వజ్రవిరోచనియను నింద్రశక్తి – ప్రకాశించును. కవాటము చేత – మూయఁబడిన హృదయస్థలమును విడిచి, దేహాదుల యందు వ్యాపించి, వీర్యమును విడువక, భద్రకాళీశక్తి సంవిద్రూపగు స్వస్థానమున గుప్తరూపమున స్ఫురించును. భైరవీశక్తి మూలాగ్నికుండమున జ్వలించును.

**అవ:-** కాళీ శక్తికిని, ఛిన్నమస్తయగు వజ్రవైరోచనికిని, అధి పిండమగు (దేహ సంబంధియగు) భేదమున్నను, అధ్యండమగు భేదము లేదనుచున్నాఁడు.

మూ॥ యద్యపి కాళీ వజ్రేశ్వర్యౌ
స్యాతాం భిన్నే ఇవ పిణ్డేషు
ఓ జస్తత్త్వస్యైక్యా దణ్డే
నద్వ్యైశక్త్యోర్భేదో భవతః 10

భద్రకాళియు, వజ్రేశ్వరియు, పిండముల యందు (వ్యష్టి శరీరముల యందు) వేరుగానున్న వారివలె నున్నారు. అయినను, వీర్య రూపమగు ఓజస్తత్త్వమొక్కటియే, కావున పరాశక్తికి బ్రహ్మాండమునందు మాత్రము – కాళీ వజ్రేశ్వరి భేదము లేదు.



మూ॥ ఏవమభేదో యద్యపికర్మ
ద్వైధాద్వైధం తత్రాపిస్యాత్।
సైవపచన్తీ భువనం కాలీ
సైవదహన్తీ శత్రూనైన్ద్రీ॥ 11

ఓజస్సుయొక్క ఏకత్వము వలన, వారికి భేదము లేకున్నను, కర్మ ద్వైధము వలన – (ద్విప్రకారమగు కర్మ వలన) బ్రహ్మాండము నందుఁ గూడ – వారికి ద్వైధము (ద్విప్రకారత్వము) కలుగుచున్నది. ఈ ప్రపంచమును పరిపక్వము నొనర్చునపుడాశక్తి – కాళియగుచున్నది. అసురాదులగు శత్రువులను దహించునపుడు – ప్రచండచండి యగుచున్నది.

**ప్రభ:-** ఈ యంశము వెనుక నుపన్యసింపఁబడినది. చూ.

మూ॥ పిణ్డే చాణ్డే జఙ్గమసారః
శుద్ధా ప్రజ్ఞా సున్దర్యుక్తా
విషయ దశాయాం దేశీభూతా
సేయం భువనేశ్వర్యాఖ్యాతా॥ 12

పిండమునందును (శరీరమునందును) అండమునందును, (బ్రహ్మాండము నందును) జంగమ ప్రాణుల యొక్క సారమును, (సారాంశమగు రసమును) శుద్ధమును, అగు ప్రజ్ఞ – (సంవిత్తు) త్రిపురసుందరిగా చెప్పఁబడుచున్నది. విషయాకారత చేత నిలుచునపుడు – ఆకాశాకారయై సర్వమును వ్యాపించిన, ఆయీచితియే – (ప్రజ్ఞయే) భువనేశ్వరిగా వ్యాఖ్యానింపఁబడుచున్నది.

**ప్రభ:-**లోపలను, వెలుపలను, అంతటను, గూడ– మూలాంశముననున్న చితియే – సుందరి. శుద్ధసంవిత్తగు, ఆ సుందరియే – విషయదశయందాకాశ దేశగతయై భువనేశ్వరి యగుచున్నదని భావము.

మూ॥ శూన్య ప్రఖ్యాయాచిల్లీనా
ప్రలయే బ్రహ్మాణి జన్మిషు సుప్తౌ
కబలిత సకల బ్రహ్మాణ్డాం తాం
కవయః శ్రేష్ఠాం జ్యేష్ఠా మాహుః॥ 13

పరమార్థమున శూన్యరూపిణి కాకున్నను; శూన్య ప్రఖ్యయైన, (శూన్యము వలె తోచునదైన) యే చిత్తు – విశ్వ ప్రలయదశయందును, జంతువుల నిద్రాదశ యందును, లయించుచుండునో, సకల బ్రహ్మాండమును గూడ కబళించునదియగు ఆ చిత్తును – క్రాంతదర్శులగు కవులు శ్రేష్ఠయగు జ్యేష్ఠనుగాఁ జెప్పుదురు.

మూ॥ నిద్రావిస్మృతిమోహాలస్య
ప్రవిభేదైస్సా భవమగ్నేషు
ఏషైవస్యా ద్యుఞ్జానేషు
ధ్వస్తవికల్పః కోఽపి సమాధిః॥ 14

ఆ జ్యేష్ఠాదేవి – జననమరణ ప్రవాహరూపమగు సంసారమున నిమగ్నులగు జంతువులయందు – నిద్ర, విస్మృతి. (మరపు) మోహము, (మూఢత, అజ్ఞానము) ఆలస్యము, (మందత) అను తమోవికారవిశేషములతో వర్తించుచున్నది. ఈ జ్యేష్ఠయే – యుంజానులను యోగుల యందు నిర్వికల్పమగు నొకానొక సమాధి యగుచుండును.

ప్రభ:- జగత్ సృష్టి కంటె ముందు – శూన్యవలెనున్న చిత్తును – జ్యేష్ఠయనుట యుక్తమేయగును. వేదమునందుఁగూడ – ''ఆ ప్రకేతం సలిలమ్'' ''నాసదాసీత్,'' ''తనోసదాసీత్'' తమ ఆసీత్ ''తమసాగూఢమగ్రే'' ఇత్యాదిమంత్రవర్ణములు – వినఁబడుచున్నవిగదా!

మూ॥ ఐన్ద్రీశక్తిర్వ్యక్తబలాచేద్
భిన్నేస్యాతాం శీర్షకపాలే
తస్మాదేతాం చతురవచస్కాః
పరిభాషన్తే ఛిన్నశిరస్కామ్॥ 15



ప్రచండచండియును. ''ఇంద్రశక్తి'' యోగియందు వ్యక్తమగు బలముగలదగునెడల, (విక్రమమును ప్రదర్శించిన యెడల) శిరఃకపాలములు – భిన్నములగును. కావుననే, యీశక్తిని – చతురవచస్కులగు పండితులు 'ఛిన్నమస్త' అను పరిభాషతోఁ జెప్పుదురు.

ప్రభ:- యోగులయందు కపాలభేదము – ప్రసిద్ధము. ఈ యర్థము – వెనుక వ్యాఖ్యానింపఁబడినది. ''వ్యపోహ్య శీర్షకపాలే భూతిత్యగ్నౌ ప్రతితిష్ఠతి'' అను శ్రుతి యొక్క యర్థము – యోగిజనానుభవైక వేద్యము. ఆచార్యపాదులు **(గణపతి మునీంద్రులు జీవించియుండునపుడు, తత్ కపాలభేదము కలిగెనను నంశమింతకుముందే - చెప్పబడినది).**

మూ॥ భవతి పరావాగ్ భైరవ్యాఖ్యా
పశ్యన్తీ సాకథితాతారా
రసనిధిమాప్తా జిహ్వారఙ్గం
మాతఙ్గీతి ప్రథితాసేయమ్॥ 16

మూలాధార చక్రమున నివసించునదియు, తురీయమును, (నాలుగ వదియు) అగు పరావాక్కు త్రిపుర భైరవి యను పేరుగలదై యున్నది. మణిపూరకచక్ర నిలయయు, కారణావస్థ గలదియు, నగు పశ్యంతీ వాక్కు – తంత్రశాస్త్రములయందు ప్రసిద్ధయగు తారాదేవియై యున్నది. రసములకు నిధానమగు జిహ్వారంగమును పొందిన వైఖరీ వాక్కు – మాతంగియని (దశమహావిద్యల యందు) ప్రసిద్ధి నొందియున్నది.

మూ॥ పిణ్డే చాణ్డే స్తమ్భనశక్తి
ర్బగలామాత స్తవ మహిమైకః।
సర్వేవ్యక్తాః కిరణాః కమలా
బాహ్వో మహిమా భువనామ్బ! తవ॥ 17

మాతా! పిండమునందును, బ్రహ్మాండమునందును, ఏకమగు మహిమయగు స్తంభనశక్తి – బగలాదేవియగుచున్నది? భువన జననీ! వ్యక్తములగు (స్పష్టములగు) కిరణములన్నియు – లక్ష్మియగుచున్నది. ఆయమ్మ – నీకు బాహ్యమగు, (వెలుపలనున్న) మహిమ.

**ప్రభ:-** లోపలను, వెలుపలను, అంతటను గల, స్తంభనశక్తియే – బగలా ముఖి, జగత్తునందు స్పష్టములగు సర్వశోభలును – లక్ష్మీదేవియై యున్నది.

**అవ:-** ఇట్లు, దశమహా విద్యల తత్త్వములును, స్థానములును' సంగ్రహముగాఁ దెలిపి– వాని ప్రసాదలాభమున కుపాయములును' ఉపాసనా విధములును, ఉపదేశించుచు, 'లలిత' మొదలు 'కమల' వఱకును గల యావిద్యలను వర్ణించుచున్నాఁడు.

మూ॥ బోధే బోధే బోద్ధుశ్శక్తిం
సఙ్కల్పానాం పశ్చాద్ భాన్తీమ్ ।
అవిముఞ్చన్యో మను తేధీరో
యత్ కిఞ్చిద్వా లలితా వతితమ్॥ 18

ప్రత్యేకముగా, ఉదయించుచున్న చిత్త వృత్తులకు వెనుక తదాధారమైన సాక్షిగా స్ఫురించునదియు, ప్రతిబోధము నందును, జ్ఞాత యొక్క గ్రహణ సామర్థ్యరూపమగు శక్తిని విడువక, (దృఢముగా ధరించుచు) దేనినైనను చింతించుచుండు ధీరుని – లలితాదేవి (త్రిపురసుందరీ దేవి) రక్షించును.

**ప్రభ:-** ప్రతి సంకల్పమునకును, వెనుకనున్న బోధశక్తిని – దృఢముగా ధరించి, సంకల్పముల నొనర్చుధీరునికి – లలితా ప్రసాదలాభము కలుగును. ఇందు లలితా త్రిపురసుందర్యుపాస్తి – చెప్పఁబడినది.



మూ॥ దృష్టౌ దృష్టౌ ద్రష్టుశ్శక్తిం
లోచనమణ్డల మధ్యే భాన్తీమ్।
అవిముఞ్చన్యః పశ్యతి ధీరో
యత్ కిఞ్చిద్వాతమవత్యైన్ద్రీ॥ 19

లోచనమండల మధ్యమున, (అక్షిపురుష బింబమధ్యమున) భాసించుచు, ప్రతిదృష్టియందును గల దర్శనశక్తిని విడువక, దృఢముగా గ్రహించి, దేనినైనను చూచుచుండు ధీరుని – ప్రచండ చండియను. ఐంద్రి రక్షించును.

**ప్రభ:-** దర్శనశక్తిని దృఢముగాధరించి, దర్శన వ్యాపారము నొనర్చు వానికి– ఛిన్నమస్తానుగ్రహలాభము కలుగునని భావము.

మూ॥ ప్రాణసమీరం విదధానమిమం
నిత్యాం యాత్రామత్రశరీరే।
చరణే చరణే పరిశీలయతి
స్థిరదృష్టిర్యస్త మవతి కాలీ॥ 20

ఈ శరీరమునందు తెరపిలేకుండునట్లు జీవితయాత్రను నిర్వహించుచున్న ప్రాణవాయువును – ప్రతి సంచారమునందును స్థిర దృష్టియై (అచంచల జాగరూకుఁడై) పరిశీలించువానిని – కాళీ దేవి రక్షించును.

**ప్రభ:-** ఉచ్ఛ్వాస – నిశ్వాసగతిననుసరించి, తన్మూలమును (ప్రాణమును) బొందుచు – ప్రాణము నుపాసించువానికి – కాళీ ప్రసాదము లభించునని భావము. ఉపాశకులకిది – ఉపయుక్తమును సుకరమును నగును. కాళీపరమేశ్వరి నుపాసన చేయువారికిది మొదట – ఈ యుపాసన – ముఖ్యావశ్యకమని తోచుచున్నది.

మూ॥ స్థూలవికారాన్ పరిముఞ్చన్త్యా
నిర్మలనభసిస్థిత యాదృష్ట్యా
మజ్జన్త్యా వాదహరాకాశే
లోకేశ్వర్యాః కరుణాం లభతే॥ 21

వెలుపల నంతటను గాన్పించుచున్న స్థూల వికారములను వర్జించినదియు, రూప రహితమగు ఆకాశమునందున్నదియు, నగు దృష్టిచేతఁగాని, దహరాకాశమగు హృదయమునఁ బ్రవేశించిన దృష్టి చేతఁగాని, భువనేశ్వరి నుపాసించువాఁడు- భువనేశ్వరీకృపాలాభము నొందును.

**ప్రభ:**- వెలినున్న భూమస్వరూపమును గాని, లోనున్న దహరమును గాని యుపాసించు మనుష్యుఁడు - భువనేశ్వరీ ప్రసాద భాక్కగునని భావము.

మూ॥ సర్వవికల్పాన్ పరిభూయాన్త
ర్విమలం మౌనం మహదవలమ్బ్య
కేవలమేక స్తిష్ఠతి యోఽన్త
స్తం సా జ్యేష్ఠా కురు తేముక్తమ్॥ 22

చిత్తవృత్తులనన్నింటిని గూడ తిరస్కరించి, అంతర్ముఖుఁడై, విమలమును, మహత్తరమును, అగు మౌనమును (నిశ్శబ్దభావమును) సమాశ్రయించి - అంతర్ముఖుఁడై కేవలమును ఏకస్వరూపుఁడై, నిరాలంబత్వము చేత, నిలుచున్న మనుష్యుని - జ్యేష్ఠా దేవి ముక్తునిగా నొనరించును.

**ప్రభ:**- నిర్వికల్ప నిష్ఠచేత - జ్యేష్ఠానుగ్రహము కలుగునని భావము.

మూ॥ మూలేస్థిత్వా భైరవ్యాఖ్యాం
తారాందేవీ ముద్గీథేన।
సేవేతార్యో విదితరహస్యో
మాతఙ్గీంతాం గుణగానేన॥ 23

ఉపాసనా రహస్యజ్ఞానవంతుఁడగు ఆర్యుఁడు - మూలాధార నిష్ఠచేత- త్రిపుర భైరవిని సేవింపవలయును. సర్వనాదములకును ప్రకృతిభూతమును. 'ఓమ్' అని యుపాసింపఁదగినదియు; నగు ఉద్గీథము చేత - తారా దేవిని సేవింపవలయును. స్తోత్రరూపమగు గుణ సంకీర్తనము చేత - మాతంగీదేవిని సేవింపవలయును.



**ప్రభ:**- పరా నామమగు మూలవాక్కు చేత - భైరవీదేవియు, కారణ వాక్కగు నుద్గీథము చేత - తారాదేవియు, వైఖరీ వాక్కుచేత - మాతంగీదేవియు, ప్రసన్నలగుదురని భావము.

మూ॥ ఆసనబన్ధా ద చలోభూత్వా
రుద్ధప్రాణో బగలాంభజతే।
అభితోవ్యాప్తం వ్యక్తం తేజః
కలయన్ కమలాకరుణాం లభతే॥ 24

యోగ శాస్త్ర ప్రసిద్ధములగు పద్మాసనాదులయందు స్థిరసుఖమగు నేదో యాసనమును బంధించుట వలన నిశ్చలుఁడై ప్రాణమును నిరోధించి, కుంభకసిద్ధి నొందిన మనుష్యుఁడు - బగలాముఖీ దేవి నుపాసించుచున్నాఁడు. అంతటను వ్యాపించిన స్పష్టమగు తేజస్సును గ్రహించుసాధకుఁడు - లక్ష్మీకృపాలాభము నొందుచున్నాఁడు.

**ప్రభ:**-అసన బంధము చేత స్థిరుఁడై, ప్రాణాయామము నొనర్చు సాధకునకు - బగలాముఖీ ప్రసాదలాభము గలుగును. సర్వవ్యాపిని యగు శోభను ధ్యానించువానికి - లక్ష్మీకటాక్ష ప్రాప్తి కలుగును.

అవ:- స్తబకమును ముగించుచున్నాఁడు.

మూ॥ ఏకవిధాదౌ బహుభేదాఽథో
శక్తిరనన్తా పరమేశస్య।
సభజనమార్గం గణపతిమునినా
పాదాకులకై రేవం వివృతా॥ 25

మొదట - ఏకప్రకారయు, తరువాత బహుప్రకారయు, అగుచున్న పరమేశ్వరుని యనంతశక్తి - గణపతికృత ఉపాసనోపాయ బోధసహితములగు పాదాకులక వృత్తముల చేత - వ్యాఖ్యాతయైయున్నది.

ఇది - సవ్యాఖ్యమగు అష్టత్రింశ స్తబకము.

****